క్లుప్తంగా

క్లబ్ రోడ్డు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని హైటెక్‌సిటీ కాలనీ నుంచి మంచిర్యాల క్లబ్ వెళ్లేదారిని గతంలో మూసివేయగా, ఇటీవల ఆ రోడ్డు పునఃప్రారంభించేందుకు చేపడుతున్న పనులను ఎమ్మెల్యే దివాకర్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడేళ్ల క్రితం మూసివేసిన దారిని తెరిపించాలని కాలనీవాసులు, చుట్టూ పక్కల ప్రాంతాల ప్రజలు కోరారని తెలిపారు. రోడ్డును ప్రారంభించడంతో హైటెక్‌సిటీ సెకండ్ వెంచర్‌తోపాటు, బస్టాండ్, రైల్వే స్టేషన్, రాజీవ్‌నగర్‌కు వెళ్లే ప్రజలకు సులభతరంగా మారుతుందని వార్డు కౌన్సిలర్ చైతన్యరెడ్డి తెలిపారు. వార్డు ప్రజలు హన్మంతరావు, సత్యపాల్ రెడ్డి, పురెల్ల పోచమల్లు, చంద్రశేఖర్ శెట్టి, చేతి బాలరాజు పాల్గొన్నారు.

ఘనంగా అక్షరాస్యత దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, తదితరులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక సినిమావాడ స్కూల్‌లో అక్షరాస్యత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టారు. అంతకుముందు విద్యార్థులకు అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. సెక్టోరల్ అధికారి చౌదరి, వయోజనవిద్య అధికారి పురుషోత్తం నాయక్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బాలాజీ, కార్యదర్శి వెంకటేశ్వర్లు, జోన్ చైర్‌పర్సన్ డేగ బాబు, లయన్ మధుసూధన్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం ప్రభావతి, డీఆర్పీలు వెంకటేశ్వర్లు, పద్మ పాల్గొన్నారు.

'చెన్నూర్ టికెట్ మాదిగలకే కేటాయించాలి'

మందమర్రిరూరల్: కాంగ్రెస్ పార్టీ చెన్నూర్ అసెంబ్లీ టికెట్ మాదిగలకే కేటాయించాలని పీసీసీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసారపు శ్రీనివాస్ కోరారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో 12 సార్లు ఎన్నికలు జరిగాయని, అధికశాతం మాల, ఉపకులాల కులస్తులకు టికెట్ కేటాయించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో మాదిగల ఓట్లు 43,145 ఉన్నాయని వివరించారు. పార్టీ అధిష్టానం ఈసారి టికెట్ మాదిగలకే ఇస్తోందని ధీమా వ్యక్తం చేశారు.

ఎన్‌ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడిగా వెంకటసాయి



మంచిర్యాలటౌన్: ఎన్‌ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడిగా వెంకటసాయి కుమార్‌ను జిల్లా అధ్యక్షుడు ఆదర్శవర్ధన్ శుక్రవారం నియమించారు. తనకు ఈ అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖలకు వెంకటసాయి కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

'వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం'



మాట్లాడుతున్న రఘునాథ్‌రెడ్డి

మందమర్రిరూరల్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం ఖాయమని పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, పీపీసీ మెంబర్ నూకల రమేశ్ ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో నాయకులు ఐక్యంగా ఉండి పార్టీ అభ్యర్థిని గెలిపించేలా కృషిచేయాలన్నారు. మందమర్రి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గండె రాంచందర్, మండల అధ్యక్షుడిగా నీలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడిగా పుల్లూరి లక్ష్మణ్‌లను డీసీసీ అధ్యక్షురాలు సురేఖ నియమించారు. వారికి నియామక పత్రాలు అందించారు. పట్టణ అధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్, నాయకులు ఉన్నారు.

ఆలయంలో పూజలు

మందమర్రిరూరల్: పట్టణంలోని అంగడి బజార్‌లోని సంతోషిమాత ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. అర్చకుడు దివాకర్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కుంకుమార్చన పూజలో మహిళలు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రాచర్ల రవి, సభ్యులు రాచర్ల గణేశ్, దుర్గరాజ్, శ్రీనివాస్, శ్రీకాంత్ ఉన్నారు.

ఓటరు అవగాహన ర్యాలీ

- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు



రామకృష్ణాపూర్: ర్యాలీలో పాల్గొన్న అధికారులు



దండేపల్లి: మేదరిపేట ర్యాలీలో డీఆర్డీవో శేషాద్రి



లక్సెట్టిపేట: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



చెన్నూర్‌లో..



భీమారంలో..



కాసిపేట: ర్యాలీలో పాల్గొన్న అధికారులు



బెల్లంపల్లిలో నిర్వహించిన ర్యాలీలో అధికారులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని రామాలయం చౌరస్తా నుంచి ఏజోన్ ఏరియాలోని ప్రధాన కూడళ్లలో శుక్రవారం ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. ఓటరు సవరణలు ఉంటే ఆయా వార్డుల్లోని బీఎల్‌ఓలను సంప్రదించి సవరణలు చేసుకోవాలని సూచించారు. కౌన్సిలర్ జాడిశ్రీనివాస్, కోఆప్షన్ సభ్యురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పాత బస్టాండ్ తిలక్ స్టేడియం నుంచి బజారుఏరియా పురవీధుల మీదుగా పాఠశాల విద్యార్థులతో కలిసి అధికారులు కాంటాచౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు జన్మ హక్కు అంటూ విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. కాంటా చౌరస్తాలో బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత, తహసీల్దార్ సుధాకర్, కమిషనర్ సమ్మయ్య పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కౌన్సిలర్లు శ్రీలత, షేక్ ఆస్మా, గెల్లి రాజలింగు, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: గ్రామాల్లో ప్రజాప్రతినిదులు, అధికారులు ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఎంఈవో రవీందర్ ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో స్థానిక గాంధీచౌక్ నుంచి ర్యాలీ తీశారు.

చెన్నూర్: మున్సిపల్ కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా వరకు ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, డిప్యూటీ తహశీల్దార్ గోవింద్ నాయక్, కౌన్సిలర్లు మహేశ్, అనిల్, కోఆప్షన్ సభ్యులు శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్: దుగ్నెపల్లిలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై తహసీల్దార్ బి.సుధాకర్ అవగాహన కల్పించారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో సర్పంచులు సురేష్, అశోక్, రంజిత, పద్మావతి, ఎంపీటీసీలు, కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దండేపల్లి: గ్రామాల్లో ఓటరు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మేదరిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్‌డీవో శేషాద్రి పాల్గొన్నారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో మల్లేశం, ఎంపీవో సత్యనారాయణ, సర్పంచులు, విద్యార్థులు ఉన్నారు.

కాసిపేట: మోడల్‌స్కూల్, కళాశాల విద్యార్థులతో స్పెషల్ గ్రామసభ ఎస్‌వీఈఈపీ కార్యక్రమంలో భాగంగా ఓటుహక్కు అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో అలీం, ప్రిన్సిపాల్ నాగమల్లయ్య పాల్గొన్నారు.

వేమనపల్లి: మండల కేంద్రంతోపాటు నీల్వాయిలో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచులు మధుకర్, మధు, తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీటీసీ సంతోష్‌కుమార్, ఎంపీఓ బాపురావు, ఏపీఓ సత్యప్రసాద్, ఆర్‌ఐ లక్ష్మణ్ పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, స్థానికులతో కలిసి ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ సతీశ్‌కుమార్, గిర్దావర్‌లు ప్రభు, మంగ, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ బాలుర పాఠశాలల విద్యార్థులు, తహసీల్దార్ విశ్వంబర్, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తీరిన నీటి కష్టాలు

సాక్షి ఎఫెక్ట్..

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో తాగునీరు కావాలంటే మోటారు ఆన్‌చేసేందుకు కర్రల సాయం తీసుకోవాల్సిన పరిస్థితి. కాలనీలో మోటారుకు ఏర్పాటు చేసిన విద్యుత్ స్టార్టర్ చెడిపోయింది. దీంతో నీళ్లకోసం యువకులు రెండు విద్యుత్ వైర్లను జతచేయాల్సి వస్తుంది. ఈ దుస్థితిపై సాక్షిలో గతనెల 14న 'ప్రమాదం జరగకముందే..స్పందించండి' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి మున్సిపల్ అధికారులు స్పందించారు. చెడిపోయిన స్టార్టర్ స్థానంలో కొత్తది బిగించారు. దీంతో కాలనీ వాసులు కష్టాలు తీరాయి.



కొత్త స్టార్టర్ ఏర్పాటు చేసిన అధికారులు

పోడు జాబితాలో చేర్చాలని వినతి

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ అటవీ బీట్‌లో సర్వేనంబర్ 25, 26లో సుమారు 150 ఎకరాల్లో చెట్లపొదలు తొలగించి పంటలు సాగు చేసుకుంటున్న తమకు పోడు పట్టాలు ఇవ్వాలని కోయపోచగూడ గిరిజనులు డిమాండ్ చేశారు. ఈమేరకు తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో మల్లేశంను వేర్వేరుగా కలిసి శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. పలువురు గిరిజనులు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

సంక్షిప్త వార్తలు

కాంగ్రెస్‌లో చేరికలు

రామకృష్ణాపూర్: పట్టణానికి చెందిన పలువురు మహిళలు, యువకులు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ చెన్నూర్ నియోజకవర్గ టికెట్ ఆశిస్తున్న రామిళ్ల రాధిక సమక్షంలో క్యాతనపల్లిలో పార్టీలో చేరారు.

నూతన కమిటీ ఎన్నిక

చెన్నూర్: పట్టణ ఇంజనీరింగ్, వెల్డింగ్ వర్క్స్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా నిజామొద్దీన్, ఉపాధ్యక్షుడిగా పోచం, జావిద్, ప్రధాన కార్యదర్శిగా షకీల్‌అమ్మద్, కోశాధికారిగా దాసరి రవి, సంయుక్త కార్యదర్శిగా సలీమొద్దీన్, గౌరవ అధ్యక్షుడిగా కొండపాక చారి, కార్యదర్శులుగా సత్తార్, మోహీన్, ప్రచార కార్యదర్శులుగా బాషాసింగ్, రామకృష్ణ ఎన్నికయ్యారు.

అధిక వర్షాలకు పత్తికి తెగుళ్లు

భీమారం: అధిక వర్షాలతో రైతులు పండిస్తున్న పత్తి మొక్కలకు తెగుళ్లు సోకాయని చెన్నూర్ ఏడీఏ దుర్గం బాపు తెలిపారు. మండలంలోని ఆరెపల్లిలో పత్తి చేనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. పత్తి మొక్కల్లో పారావిల్స్ ఉన్నట్లు నిర్ధారించారు. దీని ద్వారా మొక్కలు వాలిపోవడం, పూత రాలిపోతుందన్నారు. దీని నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 కిలోల లీటర్ నీటిలో కలుపుకుని చెట్ల వేర్ల వద్ద డ్రెంచింగ్ చేయాలన్నారు. ఏఈవో అరుణ్‌కుమార్, రైతులు ఉన్నారు.

పట్టాలివ్వాలని ధర్నా

చెన్నూర్: ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని ముదిరాజ్‌లు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ శివారులోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 1418లో గత 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని అన్నారు. అధికారులు పట్టాలు అందించాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ గోవింద్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో శ్రమదానం

వేమనపల్లి: మండలంలోని కల్మలపేట యూపీఎస్ పాఠశాల వద్ద యూత్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రమదానం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు పవన్, ఎస్‌ఎంసీ కమిటీ ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, ఆదిల్, రాజేష్, రాజారాం, శ్రీనివాస్, అంజన్న పాల్గొన్నారు.

దరఖాస్తులు చేసుకోండి

కాసిపేట: స్థానిక మోడల్‌స్కూల్ అండ్ కాలేజీలో ఆంగ్లం, ఎకనామిక్స్ బోధించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆందె నాగమల్లయ్య ఓ ప్రకటనలో తెలిపారు. బయోడేటా ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 11న సోమవారం డెమోకు హాజరుకావాలని సూచించారు.

10న సింగరేణి గిరిజన ఉద్యోగుల సదస్సు

జైపూర్: మందమర్రిలోని సీఈఆర్ క్లబ్‌లో ఈనెల 10న సింగరేణి గిరిజన ఉద్యోగుల ఎగ్జిక్యూటివ్ సదస్సు నిర్వహించనున్నట్లు సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు భాస్కర్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే సదస్సుకు ఏరియాల నుంచి ఎగ్జిక్యూటివ్స్ హాజరుకావాలని సూచించారు.

జక్కెపల్లిలో వైద్యశిబిరం

వేమనపల్లి: జక్కెపల్లిలో గ్రామస్తులు జ్వరాల బారిన పడటంతో వైస్ ఎంపీపీ ఆత్రం గణపతి సూచనతో వైద్య సిబ్బంది శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరపీడితుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. అనంతరం వారికి మందులు పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ శ్రీవాణి, హెల్త్ అసిస్టెంట్ బాపు, ఏఎన్‌ఎం మంజుల, ఆశ కార్యకర్త సుమలత పాల్గొన్నారు.

సైన్స్‌పై విద్యార్థులు దృష్టిపెట్టాలి

భీమారం: విద్యార్థులు సైన్స్‌పై దృష్టిపెట్టాలని జిజ్ఞాస సంచార ప్రయోగశాల నిర్వాహకుడు సాయికుమార్ పేర్కొన్నారు. విద్యాశాఖ ద్వారా ఏర్పాటు చేసిన జిజ్ఞాస సంచార ప్రయోగశాల వాహనం శుక్రవారం బూర్గుపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చేరుకుంది. ప్రయోగశాలలో ఉన్న వివిధ ప్రయోగాలను విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించారు. పాఠశాల హెచ్‌ఎం విజయ్‌కుమార్ ఉన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు వరం



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

నెన్నెల: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి షాదీముబారక్ పథకాలు వరంలా మారాయని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 22 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గంలో ఇప్పటివరకు 8015 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు, 612 మందికి షాదీముబారక్ చెక్కులు అందజేశామన్నారు. ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ శ్యామల, పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేశ్, ఎంపీటీసీ తిరుపతి, కోఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, రైతు సమితి అధ్యక్షుడు అశోక్‌గౌడ్, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో వరలక్ష్మి, నాయకులు రాంచందర్, ప్రతాప్‌రెడ్డి, సర్పంచులు, నాయకులు బత్తిని వెంకటేశ్, ప్రేంసాగర్‌రావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

కాసిపేట: మండలంలోని పలు అభివృద్ధి పనులకుకు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య శుక్రవారం భూమిపూజ చేశారు. లంబాడితండా(కె)లో రూ.40 లక్షలతో సీసీ రోడ్డు, రూ.20 లక్షలతో పంచాయతీ భవనం, మల్కేపల్లిలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, రూ.20 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఎంపీపీ రొడ్డ లక్ష్మి, జెడ్పీటీసీ చంద్రయ్య, వైస్ ఎంపీపీ విక్రంరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

బెల్లంపల్లి: తాండూర్ మండలంలో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను ఏఎంసీ ఏరియాలోని క్యాంప్ కార్యాలయంలో తాండూర్ మండల ప్రజాప్రతినిధులు శుక్రవారం సన్మానించారు. బోయపల్లి నుంచి బుగ్గ ఆలయం వరకు బీటీ రోడ్డుకు రూ.2.40 కోట్లు, కత్తెర్ల నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి వరకు బీటీ రోడ్డుకు రూ.1.60 కోట్ల నిధులను ఎమ్మెల్యే మంజూరు చేయించారు. ఎంపీటీసీ సభ్యురాలు మాసాడి శ్రీదేవి, అంకుశం సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకులు, స్థానికులు ఎమ్మెల్యేను సత్కారించారు.

బీజేపీ ఆధ్వర్యంలో నా దేశం-నా మట్టి



బెల్లంపల్లిరూరల్: మట్టి సేకరిస్తున్న నాయకులు

బెల్లంపల్లిరూరల్: బీజేపీ ఆధ్వర్యంలో మండలంలోని బట్వాన్‌పల్లిలో శుక్రవారం నా దేశం-నా మట్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్టి వెంకటకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు గజ్జెల్లి రాజ్‌కుమార్ మాట్లాడారు. ఆజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా ఢిల్లీలో అమృత వాటిక నిర్మాణం కోసం ప్రతి గ్రామం నుంచి మట్టి సేకరించి పంపనున్నట్లు తెలిపారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రెవెల్లి రాజలింగు, నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శులు గంగారామ్, రాములు, నాయకులు నగేష్, భరత్, రమాకాంత్, స్వామి, లక్ష్మణ్, మధు, ప్రశాంత్ పాల్గొన్నారు.

వేమనపల్లి: మేర మట్టి మేర దేశ్‌లో భాగంగా మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు బైస మల్లేష్ ఆధ్వర్యంలో మట్టి సేకరణ చేపట్టారు. బెల్లంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బట్టి వెంకటకృష్ణ హాజరయ్యారు. మండల ఉపాధ్యక్షుడు ఏట మధుకర్, ప్రధాన కార్యదర్శి గణపురం సంతోష్, భట్టు మల్లేశ్, పుల్లయ్య, రవి పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

చెన్నూర్: పట్టణంలోని శర్వాణీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో అలరించారు. పాఠశాల కరస్పాండెంట్ మేడ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు



దరఖాస్తు చేసుకుంటున్న పైడిమల్ల నర్సింగ్



దరఖాస్తు చేస్తున్న ఏమాజీ, శ్రీదేవి



దరఖాస్తు చేసుకుంటున్న ముల్కల్ల మల్లారెడ్డి



దరఖాస్తు అందజేస్తున్న రవి

మందమర్రిరూరల్: వచ్చే ఎన్నికల్లో చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ కోసం బీజేపీ నుంచి పట్టణానికి చెందిన పైడిమల్ల నర్సింగ్ దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లు నర్సింగ్ తెలిపారు.

మంచిర్యాలటౌన్: బీజేపీ మంచిర్యాల అసెంబ్లీ టికెట్ కోసం ముల్కల్ల మల్లారెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో దరఖాస్తు చేసుకున్నారు. 2014లో పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోగా, ఆ తర్వాత జిల్లా అధ్యక్షుడిగా కొనసాగారు. ప్రస్తుతం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఉన్న ఆయన మరోసారి పోటీచేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు.

బెల్లంపల్లి: బీజేపీ టికెట్ కోసం బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇద్దరు నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి దరఖాస్తు చేశారు. దరఖాస్తుదారులకు మద్దతుగా బి.కేశవరెడ్డి, కె.గోవర్ధన్, పుల్గం తిరుపతి, రాజేశ్వర్, రాజులాల్, రామయ్య వెంట వెళ్లారు.

దండేపల్లి: బెల్లంపల్లి నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మండలంలోని గూడెం గ్రామానికి చెందిన శాతరాజీ రవి బరిలోకి దిగేందుకు దరఖాస్తు చేసుకున్నాడు. శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో దరఖాస్తు అందజేసినట్లు తెలిపారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని 21వ వార్డులోని పెద్దమ్మ టెంపుల్ వద్ద రూ.లక్ష డీఎంఎఫ్‌టీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లను ఎమ్మెల్యే దివాకర్‌రావు శుక్రవారం ప్రారంభించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు తిరుపతి, రవీందర్‌రావు, సరోజ, కొమురయ్య, రమేశ్ పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి కృషి

నస్పూర్: పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలోని 12వ వార్డు ఇందిరమ్మ కాలనీలో ఇంటింటికీ బీఆర్‌ఎస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఇళ్లపట్టాల సర్వే

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఏజోన్ తారకరామ కాలనీలో శుక్రవారం సింగరేణి ఇళ్ల పట్టాల కోసం సర్వే చేపట్టారు. జీవో నెంబర్ 76 కింద పట్టాల కోసం దరఖాస్తు చేసుకుని డీడీలు తీసిన వారంతా ఇంటికి సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. ఆర్‌ఐలు నవీన్‌కుమార్, బొలిశెట్టి పద్మజ, సర్వేయర్ సంతోష్, మీరజ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకే ప్రజలు పట్టం కట్టాలని మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, యువ నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు కోరారు. జిల్లా కేంద్రంలోని 8వ వార్డు పాతమంచిర్యాలలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి పథకాలపై అవగాహన కల్పించారు. వారికి అందుతున్న పథకాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీసీసీబీ డైరెక్టర్ తిరుపతి, ప్రదీప్, రాకేశ్, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాసిపేట: కొండాపూర్ 33/11కేవీ సబ్‌స్టేషన్, ఫీడర్ల మరమ్మతుతో మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ స్వర్ణలత తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుతో బజారుఏరియా, కన్నాల బస్తీ, పోస్టాఫీసు బస్తీ, పెద్దనపల్లి, కాల్‌టెక్స్, గాంధీనగర్, టేకులబస్తీ, బూడిదగడ్డబస్తీ, రాంనగర్, అశోక్‌నగర్, రడగంబాల బస్తీ, ఏఎంసీ ఏరియా, సుభాష్‌నగర్, నెంబర్-2 ఇంక్లైన్ బస్తీ, శాంతిఖని బస్తీల్లో శనివారం కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలివేస్తామని తెలిపారు.

చెన్నూర్: పట్టణంలోని టౌన్-2 ఫీడర్‌లో మరమ్మతుతో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు.

మందమర్రిరూరల్: అందుగులపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతులతో జీఎం ఆఫీస్ ఏరియా, కేకే-2 ఏరియా, ఊరుమందమర్రి, మార్కెట్ ఏరియా, దీపక్‌నగర్, పాలచెట్టు ఏరియా, పులిమడుగు, కోటేశ్వరరావుపల్లె, బొక్కలగుట తదితర ప్రాంతాలకు శనివారం సరఫరా ఉండదని ఏఈ మల్లేశం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నస్పూర్: పట్టణంలోని అన్ని వార్డుల్లో శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ రామ్మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు.

కార్యాలయాలకు తాళాలు

దండేపల్లి: సమగ్రశిక్షలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11 తేదీ వరకు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. 17 విభాగాల ఉద్యోగులు ఈనెల 4 నుంచి జిల్లా కేంద్రంలో 11 వరకు రిలే దీక్షలు చేపట్టారు. ఉద్యోగులందరూ దీక్షకు వెళ్లడంతో జిల్లాలోని 18 మండలాల్లో ఎమ్మార్సీ కార్యాలయాలు మూసి ఉంటున్నాయి.

తాగునీటి కోసం ఇక్కట్లు

జన్నారం: కవ్వాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తాగునీటి కోసం ఇక్కట్లు పడుతున్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం 500 మీటర్ల దూరంలో చేతిపంపు వద్దకు వెళ్లి దాహం తీర్చుకుంటున్నారు. అదే విధంగా బాలికలు, బాలురకు ఒకే మూత్రశాల ఉండటంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంపై పాఠశాల హెచ్‌ఎం రాజేందర్‌ను సాక్షి సంప్రదించగా, కరెంట్ లేకపోవడంతో విద్యార్థులు మంచినీటికి బయటకు వెళ్లారని తెలిపారు. ఒకే మరుగుదొడ్డి ఉందని, దాంతో బాలురు బయటకు వెళ్లాల్సి వస్తుందన్నారు.